క్లుప్తంగా

మనుస్మృతి పత్రుల దహనం

ప్రకాశం నగర్: బీఎస్పీ అర్బన్ ఇన్‌చార్జి, న్యాయవాది రాంబాబు ఆధ్వర్యంలో స్థానిక గోకవరం బస్టాండ్ సమీపంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద సోమవారం మనుస్మృతి పత్రులను దహనం చేశారు. రాంబాబు మాట్లాడుతూ కులవ్యవస్థకు మూలమైన మనుస్మృతిని దహనం చేసి, దాని స్థానంలో రాజ్యాంగాన్ని తీసుకొచ్చినా, నేటికి ఈ దేశంలో పెత్తందారీ కులాలు మనుస్మృతినే పాటిస్తూనే ఉన్నాయన్నారు. కార్యక్రమంలో బీఎస్పీ జిల్లా అధ్యక్షుడు, పట్నాల విజయకుమార్, జిల్లా ఇన్‌చార్జి పరమట గణేశ్వరరావు, కొంకి రమేష్, రాజేష్, సింహాచలం, పి.పోతురాజు పాల్గొన్నారు.

యాదవుల ఆత్మీయ సమావేశం



ఆత్మీయ సమావేశంలో పాల్గొన్న యాదవులు

సీటీఆర్ఐ: స్థానిక యాదవుల సంఘం కార్యాలయంలో సోమవారం యాదవుల ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సంఘ ప్రతినిధి బర్ల వియజ్ మాట్లాడుతూ రాజమహేంద్రవరం పార్లమెంట్ స్థానంలో యాదవులు 1,50,000 మందికి పైగా ఉన్నారన్నారు. జనాభా దామాషా ప్రకారం ఒక ఎమ్మెల్యే స్థానం యాదవులకు కేటాయించాలని రాజకీయ పార్టీలను డిమాండ్ చేశారు. ఏ రాజకీయ పార్టీ అయితే యాదవులకు ప్రాధ్యాన్యతనిచ్చి సీటు కేటాయిస్తుందో ఆ పార్టీకే మద్దతు ఇవ్వాలని సమావేశం నిర్ణయించింది. కార్యక్రమంలో మరుకుర్తి రవి యాదవ్, జానా కేశవ యాదవ్, తురాల శ్రీనివాస్ యాదవ్, హనుమంత్ యాదవ్, మరుకుర్తి నరేష్ కుమార్ యాదవ్, మలేష్ యాదవ్ పాల్గొన్నారు.

విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో తాటాకిల్లు దగ్ధం



కాలిపోయిన తాటాకిల్లు

సీతానగరం: సింగవరం పంచాయతీ పరిధి నాగరత్నం కాలనీలో సోమవారం ఉదయం అగ్నిప్రమాదం సంభవించింది. దాసరి సత్యనారాయణ, దాసరి వెంకన్న కుటుంబాలు నివాసముంటున్న తాటాకింట్లో విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో ఒక్కసారిగా మంటలు ఎగసిపడ్డాయి. ఇంటిలోని మహిళలు బయటకు కేకలు వేస్తూ పరుగులు తీశారు. స్థానికులు అక్కడకు చేరుకుని మంటలు అదుపు చేయడానికి ప్రయత్నించినా ప్రయోజనం లేకుండా పోయింది. రాజమహేంద్రవరం నుంచి వచ్చిన అగ్నిమాపక శకటం మంటలను అదుపు చేసింది. తండ్రీకొడుకులు తమ ఇంటి పైకప్పు రేకులు వేయడానికి తెచ్చిన రూ.2 లక్షల నగదు, ఎనిమిది కాసుల బంగారు ఆభరణాలు పూర్తిగా కాలిపోయాయి. టీవీలు, ఫ్యాన్లు, ఫ్రిజ్, వంట సామగ్రి, దుస్తులు బూడిదయ్యాయి. వీఆర్వో బాబూరావు సంఘటనా స్థలానికి చేరుకుని, బియ్యం, కందిపప్పు అందించారు. వైఎస్సార్ సీపీ నాయకుడు మట్టా శ్రీనివాస్ బాధితులకు రూ.5 వేలు ఆర్థిక సాయం అందిజేశారు. ఈ ప్రమాదంలో రూ.20 లక్షల ఆస్తినష్టం జరిగిందని అంచనా.

బంగారు ఆభరణాల చోరీ

సీతానగరం: రాపాక గ్రామానికి చెందిన కోమలి అనంతలక్ష్మి బంగారు ఆభరణాలు మాయమైన ఘటనపై కేసు నమోదు చేశామని ఎస్సై కె.చిరంజీవి సోమవారం తెలిపారు. అనంతలక్ష్మి ఈనెల 23న ఎనిమిది కాసుల బంగారు ఆభరణాలను బ్యాగులో పెట్టుకుని రాజమహేంద్రవరం కోటిపల్లి బస్టాండ్ వద్ద ఆటో ఎక్కి రాపాక వచ్చింది. అనంతరం బ్యాగులో చూడగా ఆభరణాలు కనిపించలేదు. దీంతో పోలీసులకు ఫిర్యాదు చేసింది.

గుండెపోటుతో వ్యక్తి మృతి

కంబాలచెరువు: స్థానిక ఒకటో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో గుండెపోటుతో వ్యక్తి మృతి చెందిన సంఘటన ఆదివారం చోటు చేసుకుంది. పాలచర్లకు చెందిన దేవాబత్తుల చంద్రరావు (71) రాజమహేంద్రవరానికి ఓ పనిపై వచ్చాడు. రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తున్న అతడు కంచుమర్తివారి వీధిలోని లక్ష్మీ సాయినాథ్ ట్రేడింగ్ కంపెనీ వద్ద పడిపోయాడు. విషయం తెలిసిన పోలీసులు అక్కడకు చేరుకుని అతని వద్ద సమాచారం కోసం గాలించారు. అతని వద్ద నున్న సెల్‌ఫోన్ ఆధారంగా వివరాలు తెలుసుకుని, విషయాన్ని కుటుంబ సభ్యులకు తెలిపారు. అతడి వద్ద లభించిన రూ.13 వేలను వారికి అప్పగించారు. దీనిపై ఎటువంటి కేసు నమోదు కాలేదు.

బీరు బాటిల్‌తో దాడి

కంబాలచెరువు: జేఎన్ రోడ్డుకు చెందిన సాయికుమార్ నగరంలో ఆప్టింగ్ డ్రైవర్‌గా పనిచేస్తుంటాడు. సోమవారం తన స్నేహితుడి దుకాణం వద్దకు వెళ్లాడు. ఆ సమయంలో అక్కడ ఆరుగురు వ్యక్తులు ఘర్షణ పడుతున్నారు. వారి మధ్యలోకి వెళ్లి మాట్లాడుతుండగా అందులో ఒక వ్యక్తి సాయికుమార్ తలపై బీరు బాటిల్‌తో కొట్టాడు. దీంతో సాయికుమార్ తలకు గాయం కావడంతో ప్రభుత్వాసుపత్రికి వెళ్లగా వైద్యులు చికిత్స చేశారు. దీనిపై మూడో పట్టణ పోలీసులు కేసు నమోదు చేశారు.



ఎంపీ భరత్‌రామ్‌ను సత్కరిస్తున్న క్రైస్తవులు



ధవళేశ్వరం ఎస్‌ఎంఈ చర్చిలో క్రిస్మస్ వేడుకల్లో పాల్గొన్న కో ఆర్డినేటర్ చందన నాగేశ్వర్, జిల్లా పరిషత్ చైర్మన్ వేణుగోపాలరావు



జాంపేట సెయింట్‌పాల్ లూథరన్ చర్చిలో ప్రార్థన చేస్తున్న ఫాదర్

ఏసు జననం.. మానవాళికి శుభోదయం

- ఎంపీ మార్గాని భరత్ రామ్
- ఘనంగా క్రిస్మస్ వేడుకలు



ఆరాధనలో పాల్గొన్న ఎంపీ భరత్ రామ్, రుడా మాజీ చైర్ పర్సన్ షర్మిలారెడ్డి, టీడీపీ నాయకుడు ఆదిరెడ్డి వాసు

సీటీఆర్ఐ: ఏసుక్రీస్తు జననం మానవాళికి శుభోదయమని ఎంపీ మార్గాని భరత్ రామ్ అన్నారు. ప్రభువు పరిపూర్ణమైన కృపతో రానున్న రోజుల్లో రాజమహేంద్రవరాన్ని విశ్వనగరంగా తీర్చిదిద్దాలని ఉందన్నారు. క్రిస్మస్ పర్వదినం సందర్భంగా నగరంలోని పలు క్రైస్తవ మందిరాలను సోమవారం ఆయన సందర్శించారు. క్రైస్తవులకు శుభాకాంక్షలు తెలిపారు. ఆయనను ఆయా చర్చిల నిర్వాహకులు, పెద్దలు, పాస్టర్లు ఘనంగా సత్కరించి, ఆశీసులు అందజేశారు. ఈ సందర్భంగా ఎంపీ భరత్ మాట్లాడుతూ గత సంవత్సరం క్రైస్తవ సంఘాలు తన దృష్టికి బరియల్ గ్రౌండ్ సమస్యను తీసుకొచ్చారని, ప్రభువు కృప వల్ల ఆ సమస్య పరిష్కరించినట్టు తెలిపారు. రెండు దశాబ్దాలుగా ఉన్న సమస్యను పరిష్కరించానంటే అది దేవుని సహకారం వల్లనే సాధ్యమైందన్నారు. రాజమహేంద్రవరం అభివృద్ధిలో శరవేగంతో పరుగులు పెడుతోందని, మరింత అభివృద్ధి చేసేందుకు మీ అందరి ఆశీసులు, మద్దతు కావాలని ఎంపీ కోరారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి ప్రభువు ఆశీసులు నిండుగా ఉండేలా మీ అందరూ ప్రార్థించాలని కోరారు. నగరంలోని బుచ్చయ్య నగర్ బిషప్ లాజరాస్ రాక్, రాజా థియేటర్ రోడ్డు బ్రదరన్, క్వారీ మార్కెట్ రోడ్డులోని డాక్టర్ జాన్ వెస్లీ, టీటీడీ రోడ్డులోని సెయింట్ పీటర్స్, లాలా చెరువులోని జాన్ వెస్లీ హోసన్నా, కియా షోరూమ్ ఎదురుగా మరనాత మహిమ దేవాలయం, ఆనంద్ రీజెన్సీ ఎదురుగా బైబిల్ మిషన్ కాథెడ్రాల్, ఏవీఏ రోడ్డులో బైబిల్ ప్లేస్, ఏవీఏ రోడ్డు పీఎస్ఎన్ చర్చిల్లో నిర్వహించిన క్రిస్మస్ వేడుకలకు ఆయన హాజరయ్యారు. ఎంపీ వెంట వైఎస్సార్ సీపీ నగర అధ్యక్షుడు అడపా శ్రీహరి, నక్కా శ్రీ నగేష్ తదితరులు ఉన్నారు.

అనుసరణీయం

ధవళేశ్వరం: ధవళేశ్వరం ఎస్‌ఎంఈ చర్చిలో సోమవారం క్రిస్మస్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా డీసీసీబీ చైర్మన్ ఆకుల వీర్రాజు మాట్లాడుతూ క్రీస్తు బోధనలు అనుసరణీయమన్నారు. జిల్లా పరిషత్ చైర్మన్ విప్పర్తి వేణుగోపాలరావు, వైఎస్సార్ సీపీ రూరల్ కో ఆర్డినేటర్ చందన నాగేశ్వర్ విచ్చేసి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు తలారి వరప్రసాద్, గునిపే అశోక్, బోడపాటి కుమార్ పాల్గొన్నారు.

ఘనంగా వేడుకలు

రాజమహేంద్రవరం రూరల్: నియోజకవర్గంలో సోమవారం క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. మండలంలోని గ్రామాలు, వీధుల్లోని చర్చిల్లో వేడుకలు జరిగాయి. స్థానిక ఐఎల్‌టీడీ సెంటర్‌లోని ఏపిఫానియా లూథరన్ చర్చిలో ఉదయం నుంచి ప్రత్యేక ప్రార్థనలు చేశారు.



ధవళేశ్వరం ఎస్‌ఎంఈ చర్చిలో మాట్లాడుతున్న డీసీసీబీ చైర్మన్ ఆకుల వీర్రాజు



సుబ్రహ్మణ్యం మైదానంలోని హోలీ ట్రినిటీ లూథరన్ చర్చిలో ప్రార్థనలు

అందరిలో సాహితీ చైతన్యం కలగాలి

సీటీఆర్ఐ: ప్రతి ఒక్కరిలో సాహితీ చైతన్యం కలగాలని సాహితీ వేదిక నిర్వాహకుడు డాక్టర్ అరిపిరాల నారాయణరావు అన్నారు. గౌతమీ ప్రాంతీయ గ్రంథాలయంలో రెండు రోజుల సాహితీ వేదిక సభలు సోమవారంతో ముగిశాయి. రెండోరోజు సభలో సభ్యులు ఇష్ట కవితా పఠనం చేశారు. తమకు నచ్చిన కథలు వినిపించారు. వాటిపై సభ్యులు తమ అభిప్రాయాలు చెప్పారు. ఈ సందర్భంగా డాక్టర్ అరిపిరాల నారాయణరావు మాట్లాడుతూ రాజమహేంద్రవరంలో సాహిత్యానికి, సాహిత్యకారులకు కొదవ లేదన్నారు. గోదావరి నీరు తాగిన ప్రతి ఒక్కరికీ సాహిత్యాభిలాష ఉంటుందన్నారు. రెండు రోజులుగా పుస్తకావిష్కరణలు, కవితా సంపుటాలతో అలరించారన్నారు. కార్యక్రమంలో మల్లాప్రగడ రామారావు, కల్లూరి భాస్కరం, సాహితీ వేదిక కన్వీనర్ కుప్పిలి పద్మ, ఎర్రాప్రగడ రామకృష్ణ దంపతులు, జంధ్యాల శరత్ బాబు, ఒమ్మి రమేష్, పీవీ కృష్ణారావు పాల్గొన్నారు.

క్యాలెండర్ ఆవిష్కరణ



మాట్లాడుతున్న సప్పా దుర్గాప్రసాద్

సీటీఆర్ఐ: పద్మశాలి ఉద్యోగుల సంక్షేమ సంఘం జిల్లా శాఖ రాజమహేంద్రవరం ఆధ్వర్యంలో పద్మశాలి ఉద్యోగుల 2024 క్యాలెండర్, డైరీని స్థానిక భావనారుషి ఆలయంలో సోమవారం ఆవిష్కరించారు. ముఖ్యఅతిథులుగా జామిశెట్టి గాంధీ, యర్రమోతు ధర్మరాజు, డాక్టర్ ఎం.రామకోటేశ్వరరావు, డాక్టర్ సప్పా దుర్గాప్రసాద్, సప్పా ఆదినారాయణ, ఇమంది కన్నారావు హాజరయ్యారు. సంఘం జిల్లా అధ్యక్షుడు నీలం సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శి నిచ్చెనగుంట గోపికృష్ణ పాల్గొన్నారు.

నిత్య వ్యాయామంతో సంపూర్ణ ఆరోగ్యం

- ఎంపీ మార్గాని భరత్ రామ్
- ఉత్సాహంగా 5కే రన్



5కే రన్‌ను ప్రారంభిస్తున్న ఎంపీ భరత్ రామ్

ప్రకాశం నగర్: ప్రజలందరూ ఆరోగ్యంగా ఉండాలనే ఉద్దేశంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అత్యంత ప్రతిష్టాత్మకంగా ఆడుదాం ఆంధ్ర క్రీడాపోటీలు నిర్వహిస్తున్నారని వైఎస్సార్ సీపీ పార్లమెంటరీ చీఫ్, ఎంపీ మార్గాని భరత్ రామ్ అన్నారు. సోమవారం స్థానిక వై.జంక్షన్ నుంచి లాలాచెరువు వరకూ నిర్వహించిన 5కే రన్‌ను జెండా ఊపి ప్రారంభించారు. ప్రజలతో కలిసి ఆయన కూడా పాల్గొని స్ఫూర్తి నింపారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ నెల రోజుల పాటు రాష్ట్ర వ్యాప్తంగా ఆడుదాం ఆంధ్ర కార్యక్రమం కొనసాగుతుందన్నారు. మనం ఫిట్‌గా ఉంటేనే రాష్ట్రం ఫిట్‌గా ఉంటుందని, అప్పుడే అభివృద్ధి దిశగా ఏపీ శరవేగంగా పరుగులు పెడుతుందన్నారు. అనంతరం ఆర్ట్స్ కళాశాల క్రీడా మైదానంలో నెట్ బాల్, పలు వ్యాయామాలతో ఎంపీ భరత్ రామ్, రుడా చైర్మన్ రౌతు సూర్యప్రకాశరావు, వైఎస్సార్ సీపీ సిటీ కో ఆర్డినేటర్ డాక్టర్ గూడూరి శ్రీనివాస్, నగర అధ్యక్షుడు అడపా శ్రీహరి సందడి చేశారు. కార్యక్రమంలో నగరపాలక సంస్థ కమిషనర్ కె.దినేష్ కుమార్, నగర మహిళా విభాగం అధ్యక్షురాలు మార్తి లక్ష్మి, నక్కా శ్రీనగేష్, ఎస్వీ శ్రీనివాస్, వక్ఫ్ బోర్డు జిల్లా అధ్యక్షుడు ఆరీఫ్, తాతబ్బాయి పాల్గొన్నారు.

అలరించిన అష్టావధానం



అష్టావధానంలో పాల్గొన్న బాలభాను తదితరులు

సీటీఆర్ఐ: ప్రకాశం నగర్ రౌండ్ పార్క్ సమీపంలోని ధర్మంచర హాలులో నాలుగు రోజుల పాటు సారస్వత మార్గశీర్షం పేరిట జరగనున్న అష్టావధానాలు సోమవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఇందులో భాగంగా శతావధాన శ్యమంతకమణి, ప్రప్రథమ మహిళా ద్విశతావధాని ఆకెళ్ల బాలభాను (భట్నవిల్లి) అష్టావధానంతో అలరించారు. మహామహోపాధ్యాయ శలాక రఘునాథ శర్మ అధ్యక్షత వహించి ఆశీస్సులు అందించారు. అవధానప్రాచార్య, పద్యకళాతపస్వి డాక్టర్ ధూళిపాళ మహాదేవమణి సభా సంకలకత్వం వహించారు. ఎస్‌కేఆర్ మహిళా కళాశాల తెలుగు శాఖాధ్యక్షులు పిండిప్రోలు కుసుమ కామేశ్వరి (సమస్య), ఏపీ పేపర్ మిల్లు విశ్రాంత అధికారి కొనకళ్ల ఫణీంద్రరావు (దత్తపది), చైతన్య పాఠశాల తెలుగు ఉపాధ్యాయులు కుమారి మునమళ్ల దేవి (వర్ణన), పద్య కవయిత్రి ఆకుండి శైలజ (న్యస్తాక్షరి), ప్రథమశ్రేణి తెలుగు ఉపాధ్యాయులు ప్రయాగ సుబ్రహ్మణ్యం (ఆశువు), ఆదిత్య డిగ్రీ కళాశాల ఆంధ్రోపన్యాసకులు డాక్టర్ బీహెచ్‌వీ రమాదేవి (నిషిద్ధాక్షరి), పద్య గాయకులు తాతా సీతా సూర్యమహాలక్ష్మి (పురాణ పఠనము), తెలుగు ఉపాధ్యాయులు మునగాల వెంకటలక్ష్మి (అప్రస్తుత ప్రసంగం) పృచ్ఛకులుగా వ్యవహరించి రక్తికట్టించారు. శతావధాని తాతా సందీప్ శర్మ సభా నిర్వహణ చేశారు. ధర్మంచర కార్యదర్శి వక్కలంక రామం వేదికపై ఉన్నారు. పండితులు మెచ్చే రీతిన అలవోకగా ధార, ధారణ, పూరణలతో ఆకట్టుకున్న అవధాని బాలభాను దంపతులను, పృచ్ఛకులను ఎస్పీ గంగిరెడ్డి, కోసూరి చండీప్రియ, ఎన్ఆర్ సుబ్రహ్మణ్యం, దువ్వూరి మల్లికార్జునరావు సత్కరించారు. వాడ్రేవు మల్లపరాజు, నూతెళ్ల శ్రీనివాస్, బూడిద వీర్రాజు, సత్యమూర్తి, వరప్రసాద్, పలువురు సాహితీప్రియులు పాల్గొన్నారు.

కరాటేలో చిన్నారుల అద్భుత ప్రతిభ



కరాటే విజేతలకు సర్టిఫికెట్లు, పతకాలు అందజేస్తున్న చంటియ్య, ఆంజనేయులు, వీర వెంకటరావు

కడియం: కరాటేలో కడియం చిన్నారుల ప్రతిభ అద్భుతమని కడియం నర్సరీ మెన్ అసోసియేషన్ పూర్వపు అధ్యక్షుడు, సత్యదేవ నర్సరీ అధినేతలు పుల్లా చంటియ్య, పుల్లా ఆంజనేయులు, ఇండియన్ నర్సరీ మెన్ అసోసియేషన్ మాజీ ఉపాధ్యక్షులు పుల్లా వీర వెంకటరావు కితాబుఇచ్చారు. ఆదికవి నన్నయ యూనివర్సిటీ తెలుగు ఆచార్యులు డాక్టర్ తలారి వాసు, కరాటే మాస్టర్ జానకి రాముడు ఆధ్వర్యంలో ఈనెల 10న సామర్లకోటలో జరిగిన అంతర్రాష్ట్ర కరాటే పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు సోమవారం అభినందన సభ నిర్వహించారు. వారికి సత్యదేవా కుటుంబం సర్టిఫికెట్లు, పతకాలు అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గల్లీ నుంచి ఢిల్లీ వరకు కరాటేలో చిన్నారులు ప్రతిభ కనబరుస్తున్నారని, తమ ప్రోత్సాహం ఎప్పుడూ ఉంటుందని హామీ ఇచ్చారు. కరాటే మాస్టర్ జానకి రాముడు, ఆయనకు ప్రోత్సహిస్తున్న సర్వేయర్ లక్ష్మణ్‌ను సత్కరించారు. కార్యక్రమంలో సత్యదేవ మెగా కుటుంబ సభ్యులు పుల్లా పెద్ద సత్యనారాయణ, చిన సత్యనారాయణ, వీర్రాజు, రామకృష్ణ, వీరబాబు, రాజశేఖర్ పాల్గొన్నారు.

తొర్రిగడ్డ నుంచి సాగునీరు విడుదల

సీతానగరం: పురుషోత్తపట్నంలోని తొర్రిగడ్డ పంపింగ్ స్కీమ్ నుంచి సోమవారం సాగునీరు విడుదల చేశారు. వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ ఘంటా శ్రీనివాస్, నాయకులు ముదునూరి రామకృష్ణంరాజు, గద్దె వీరన్నబాబు, చింతలపూడి ముత్యాలరావు, జజ్జువరపు నాని, కూచిపూడి నాగేశ్వరరావు ముందుగా మోటార్లకు పూజలు నిర్వహించారు. అనంతరం రెండు మోటార్ల స్విచ్‌లు ఆన్‌చేసి, 150 క్యూసెక్కుల నీరు వదిలారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చిన నాటి నుంచి రైతులకు సాగునీటి ఎద్దడి కలగలేదని, పుష్కలంగా సాగునీరు అందుతోందన్నారు. దీనితో రైతులు పంటలను చక్కగా పండించుకుంటున్నారన్నారు. గత టీడీపీ ప్రభుత్వంలో రెండో పంటకు నీరు అందించాలంటే ఎకరానికి కొంత నగదు వసూలు చేసేవారని గుర్తు చేశారు. ఎమ్మెల్యే జక్కంపూడి రాజా ప్రతి ఏడాది ఖరీఫ్ సీజన్‌కు నెల రోజుల ముందుగానే సాగునీటిని అందిస్తున్నారని, ఈ ఏడాదీ ఆయన ఆదేశాల మేరకు రెండో పంటకు సాగునీరు విడుదల చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో జలవనరులశాఖ జేఈ శివప్రసాద్, రైతులు పాల్గొన్నారు.

రామతత్వాన్ని పూర్తిగా గ్రహించిన సుమిత్ర



సామవేదం షణ్ముఖశర్మ దంపతులను సత్కరించిన దృశ్యం

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): రామతత్వాన్ని పూర్తిగా గ్రహించిన వారిలో లక్ష్మణుని తల్లి సుమిత్ర ఒకరని సమన్వయ సరస్వతి సామవేదం షణ్ముఖ శర్మ అన్నారు. సోమవారం హిందూ సమాజంలో ఆయన తన ప్రవచనాన్ని కొనసాగించారు. రామతత్వం తెలిసినదే కనుక రాముని వెంట లక్ష్మణుని మరో ఆలోచన లేకుండా సుమిత్ర పంపింది. అంతే కాదు, రాముని తల్లి కౌసల్యను సాంత్వన వచనాలతో ఓదార్చింది. రాముడు అపరాజితుడు, ఆయన వెంట ఉన్న సీతాదేవి సాక్షాత్తు లక్ష్మీదేవి అని చెప్పింది. అయోధ్యా వాసులు రాముని రథం వెనుక వస్తున్నారు. వారిలో వేదవేత్తలు ఉన్నారు. వారిని చూసి రాముడు రథం దిగి నమస్కరించాడు. భరతుడు వయసులో బాలుడే కాని, జ్ఞాన వృద్ధుడు. నాపై చూపుతున్న ఆదరాభిమానాలు భరతునిపై చూపమని రాముడు వారిని కోరతాడు. రాముని మాటలు విన్న అయోధ్యావాసులు రథాన్ని అనుసరించడం మానరు. తుదకు వారు నిద్రిస్తున్న సమయంలో రాముడు సీతాలక్ష్మణులతో కలసి తరలివెళతాడు. రాముడు లేకుండా తిరిగి వచ్చిన అయోధ్యా వాసులను వారి భార్యలు మందలిస్తారు అని సామవేదం తెలిపారు.

అలరించిన బాలల నాటకం

స్థానిక హిందూసమాజంలో సమన్వయ సరస్వతి సామవేదం షణ్ముఖ శర్మ ప్రవచనాల ఆధారంగా రూపొందించిన సంపూర్ణ రామాయణం నాటకాన్ని సోమవారం దేశ విదేశాల్లో ఉన్న బాలకళాకారులు ప్రదర్శించారు. ముందుగా భాగవత విరించి డాక్టర్ టీవీ నారాయణరావు మాట్లాడుతూ అవాల్మీకాలకు తావు లేకుండా నాటకం ప్రదర్శితమవుతుందన్నారు. ఋషిపీఠం ట్రస్టు ఆధ్వర్యంలో ధృవజ్ఞానం ఆన్‌లైన్ విద్యాలయం బాలకళాకారులు నాటకాన్ని ప్రదర్శించారు. సామవేదం షణ్ముఖశర్మ దంపతులను ధ్రువ విజ్ఞానం ఆన్‌లైన్ విద్యాలయం నిర్వాహకులు నాగవేణి, ఎస్‌వీఎస్ఎన్ వర్మ, ఇతర సభ్యులు సత్కరించారు.

ఘనంగా వాజ్‌పేయి జయంత్యుత్సవం



కాతేరు మల్లయ్యపేటలో వాజ్‌పేయి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న యానాపు ఏసు తదితరులు

రాజమహేంద్రవరం రూరల్: మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజ్‌పేయి జయంతిని సుపరిపాలనా దినోత్సవంగా నిర్వహించినట్టు బీజేపీ అసెంబ్లీ కోకన్వీనర్ యానాపు ఏసు అన్నారు. కాతేరు మల్లయ్యపేట, హుకుంపేట డి బ్లాకు, శాటిలైట్‌సిటీ గ్రామాల్లో సోమవారం వాజ్‌పేయి జయంతిని ఘనంగా నిర్వహించారు. శాటిలైట్‌సిటీ అటల్ గార్డెన్‌లో వాజ్‌పేయి చిత్రపటానికి మండల ఉపాధ్యక్షురాలు ధనాల రామలక్ష్మి ఆధ్వర్యంలో నివాళులర్పించారు. జిల్లా ప్రధాన కార్యదర్శి పన్నాల వెంకటలక్ష్మి సంతోషి, అసెంబ్లీ కో కన్వీనర్ యానాపు ఏసు, రూరల్ మండలం అధ్యక్షులు ఎన్‌వీబీఎస్ ఆచారి, డాక్టర్ మూర్తి, తనుబుద్ధి సూర్య భాస్కరరావు పాల్గొన్నారు.

కడియం: అటల్ బిహారీ వాజ్‌పేయిని ఆదర్శంగా తీసుకుని, ప్రతి ఒక్కరూ భారతీయ జనతాపార్టీని బలోపేతం చేయడమే ఆయనకు నిజమైన నివాళి అని జిల్లా బీజేపీ ఉపాధ్యక్షుడు కరుటూరి శ్రీనివాసరావు అన్నారు. సోమవారం కడియపులంకలోని మండల బీజేపీ అధ్యక్షుడు నాగులపల్లి వీరబాబు నివాసంలో వాజ్‌పేయి జయంతి నిర్వహించారు. ఆయన చిత్రపటానికి కరుటూరి, నాగులపల్లి వీరబాబు పూలమాలలు వేసి నివాళులర్పించారు.అన్నారు. పెనుమాక శేషగిరిరావు, గారపాటి తాతబ్బాయి, పాటంశెట్టి రాజేష్, తీగరెడ్డి నాగార్జున పాల్గొన్నారు.

మధురపూడి: కోరుకొండలో మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజ్‌పేయి జయంతి ఘనంగా నిర్వహించారు. బీజేపీ ఏలూరు జిల్లా అధ్యక్షుడు ఏపీఆర్ చౌదరి మాట్లాడుతూ వాజ్‌పేయి ప్రధానిగా ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు నిర్వహించారన్నారు. తొలుత జెండాను ఆవిష్కరించారు.

సామ్రాట్‌కు అక్కినేని పురస్కారం



జూనియర్ అక్కినేని సామ్రాట్‌కు పురస్కారం అందజేస్తున్న జిత్‌మోహన్‌మిత్ర తదితరులు

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): మహానటుడు నట సామ్రాట్ అక్కినేని నాగేశ్వరరావు శత జయంతి ఉత్సవాలలో భాగంగా మూడో కార్యక్రమం సోమవారం జిత్‌మోహన్‌మిత్ర కళావేదికపై దొండపాటి సత్యంబాబు అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా అక్కినేని వీరాభిమాని అడబాల మరిడయ్య ఆధ్వర్యంలో అక్కినేని పురస్కారాన్ని ప్రముఖ కళాకారుడు, జూనియర్ అక్కినేని సామ్రాట్‌కు ప్రముఖ నట, గాయకులు జిత్‌మోహన్‌మిత్ర చేతుల మీదుగా అందించారు. ముందుగా అక్కినేని చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో డాక్టర్ గిరజాల సోమరాజు నాయుడు, డీవీవీఎస్ నారాయణ, గిడ్డి నరసింహమూర్తి, ముద్రగడ ఏసుబాబు, బి.సీతారామారావు, సుక్కిరెడ్డి శ్రీనివాస్, వి.జగపతి, శేషగిరిరావు, టి.శ్రీనివాస్, లక్ష్మీతులసి తదితరులు పాల్గొన్నారు.